# అధికారంలోకి రాగానే 2 టౌన్‌షిప్పులు

- ఒంగోలు వాసులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో రెండుమూడు అంతస్తులైనా నిర్మించుకోవచ్చు
- పేదల కళ్లలో ఆనందం కోసం అనేక అడ్డంకులు అధిగమించాం
- ప్రతిపక్షాల కుయుక్తులను దీటుగా ఎదుర్కొన్నాం
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఒకే రోజు నాలుగు డివిజన్లలో ఎన్నికల ప్రచారం


భాగ్యనగర్‌లో రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

**ఒంగోలు సబర్బన్:** నగరంలో సొంతిళ్లు లేని నిరుపేదల కల సాకారం చేయడానికి ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని ఇప్పటికే పూర్తి చేశామని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే ఒంగోలు నగరంలోని రెండు ప్రాంతాల్లో 2 కొత్త టౌన్‌షిప్పుల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలోని నాలుగు డివిజన్లలో ఆదివారం విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం తొలుత 20వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పసుపులేటి విజయలక్ష్మీ శ్రీనివాస్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. దారావారితోట 5వ లైన్, 4వ లైన్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించి భాగ్యనగర్ రెండో లైన్, మూడో లైన్, పాత రిజిస్ట్రార్ కార్యాలయ పరిసరాలు, భాగ్యనగర్ నాలుగో లైన్‌లో నుంచి 19వ డివిజన్‌లోని హౌసింగ్ బోర్డులోకి బాలినేని రోడ్ షో చేరుకుంది. 19వ డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబు(చిన్నారి)తో కలిసి హౌసింగ్ బోర్డులోని పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డుతో పాటు హౌసింగ్ బోర్డులోని అన్ని వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం సాయంత్రం 14వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్‌తో కలిసి సంతపేటలో ప్రచారాన్ని చేపట్టారు. సంతపేటలోని అన్ని వీధుల్లో ప్రచారాన్ని పూర్తిచేసిన బాలినేని.. 15వ డివిజన్‌లోని అన్నవరప్పాడు, రామ్‌నగర్‌లోనూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 15వ డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపీచంద్‌తో కలిసి నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రతి డివిజన్‌లో పూలవర్షం కురిపిస్తూ బాలినేనికి స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరిస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయా డివిజన్లలో బాలినేని మాట్లాడుతూ ఒంగోలు నగరంలో సొంతిళ్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. సొంతిళ్లు లేని ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఇంటి స్థలం పట్టా ఇచ్చి సొంతిళ్లు నిర్మించి ఇద్దామన్నదే తన ప్రధాన ఆలోచన అన్నారు. అందుకే ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి పట్టా ఇచ్చేంత వరకూ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనని గతంలో ప్రకటించానని గుర్తు చేశారు. ఎట్టకేలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం ద్వారా నగరంలోని రెండు ప్రాంతాల్లో నూతన రెండు టౌన్‌షిప్పులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అగ్రహారం వద్ద, వెంగముక్కలపాలెం వద్ద నగర పరిధిలోనే ఏర్పాటు చేయనుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. గేటెడ్ కమ్యూనిటీ మాదిరిగా వాటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే తనను ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ఒంగోలు నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే భాగ్యంగా భావిస్తున్నానని బాలినేని సంతోషంగా తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేరుస్తానని, అందుకోసమే నగరంలో 25 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వివరించారు. అనేక అడ్డంకులను ఎదుర్కొని పేదల కళ్లలో సంతోషమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. టీడీపీ నాయకుల కుయుక్తులను దీటుగా ఎదుర్కొన్నామని, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మొదటి నుంచీ పేదలకు అన్యాయం చేస్తూ వస్తున్నాడని ధ్వజమెత్తారు. రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, తాను కూడా అత్యధిక మెజారిటీతో ఒంగోలులో విజయం సాధిస్తున్నానని అన్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు తనకు అత్యధిక మెజారిటీ ఇస్తారన్న విశ్వాసాన్ని బాలినేని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, 20వ డివిజన్ అధ్యక్షుడు మోడుబోయిన సురేష్, నాయకులు ధూళిపాళ్ల ప్రసాదు, బ్రహ్మారెడ్డి, అంజిరెడ్డి (ఆర్‌టీఏ), గవదగట్ల రమేష్, మేకల శ్రీను, జాన్సన్ బాబు, రమేష్, 20వ డివిజన్ అధ్యక్షుడు ఆర్.రాజేష్, కరుణాకరన్, శ్రీకాంత్, సాయి, కోటి, బాబూ నాయక్, శౌరి, హరిబాబు, రామాంజనేయులు, అశోక్, గొల్లపూడి కోటి, వెలుగోటి రవిచంద్ర, సురేష్, జిలానీ, చెన్నకేశవ్, బాషా, బూర్ల వెంకటేశ్వర్లు, ఆయా డివిజన్ల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


బాలినేని రోడ్ షోలో భారీగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

# టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి 10 కుటుంబాలు

- వైఎస్సార్ సీపీ కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి మేరుగు నాగార్జున

**మద్దిపాడు:** మండలంలోని ఘడిపూడి కాలనీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత వారంతా మంత్రి మేరుగు నాగార్జున సమక్షంలో పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, ఘడియపూడి సర్పంచ్ బొమ్మల రామాంజనేయులు ఆధ్వర్యంలో బోడిపోగు శరత్, మోహన్‌చంద్, సంపత్, భరత్, రాజ్‌కుమార్, సురేష్, మహేష్, రూబేన్, మన్నవ ఎలీషా, మన్నవ తిమోతి, కనపర్తి వెంకటరావు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి మేరుగు నాగార్జున స్వాగతించారు.


వైఎస్సార్ సీపీలో చేరుతున్న ఘడియపూడి వాసులతో మంత్రి మేరుగు నాగార్జున





# ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించండి


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మేరుగు చందన్‌నాగ్

- మంత్రి మేరుగు కుమారుడు చందన్‌నాగ్

**మద్దిపాడు:** ప్రజలకు అండగా నిలిచి సేవచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున కుమారుడు మేరుగు చందన్‌నాగ్ కోరారు. ఆదివారం మండలంలోని రాచవారిపాలెం, కీర్తిపాడు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లతో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకుందామన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యేగా మేరుగు నాగార్జునను, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించాలని కోరారు.

# వైఎస్సార్ సీపీకి మద్దతు తెలపాలి

- డప్పు, చర్మ కళాకారులకు మాదిగ సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కోటేశ్వరరావు పిలుపు
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా 1.30 లక్షల కరపత్రాలు విడుదల


తాడేపల్లిలో కరపత్రాలు విడుదల చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దపోగు కోటేశ్వరరావు

**ఒంగోలు సెంట్రల్:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు అమలు చేసిన సంక్షేమ పథకాలు పొందిన పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలతో పాటు డప్పు, చర్మ కళాకారులు వైఎస్సార్ సీపీకి మద్దతు తెలపాలని మాదిగ సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దపోగు కోటేశ్వరరావు కోరారు. అందుకు సంబంధించి ముద్రించిన 1.30 లక్షల కరపత్రాలను ఆదివారం తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఒంగోలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 2.50 లక్షల డప్పు, చర్మకారుల కుటుంబాలు ఉన్నాయని, దాదాపు 7.50 లక్షల ఓట్లు ఉన్నాయని తెలిపారు. అందరూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగనన్న సంక్షేమ పథకాలు అందుకుంటున్నారన్నారు. అందువలన ప్రతి కుటుంబం వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చెయ్యాలని కోరారు. అందుకోసం రాష్ట్రంలోని జిల్లా, నియోజకవర్గ, మండల అధ్యక్షులు కృషి చెయ్యాలని కోరారు. మళ్లీ జగనన్న సీఎం అయితేనే పేదలకు పథకాలు అంది ఆర్థికంగా న్యాయం జరుగుతుందని తెలిపారు.

## ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

- రూ.1.46 లక్షల నగదు, 10 ఫుల్ బాటిళ్లు చోరీ

**చీమకుర్తి:** ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. రూ.1.46 లక్షల నగదు, 10 ఫుల్ బాటిళ్ల మద్యం సీసాలను దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. శనివారం రాత్రి చీమకుర్తి పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలోని మద్యం దుకాణంలో ఈ సంఘటన జరిగినట్లు చీమకుర్తి సీఐ దుర్గా ప్రసాద్ తెలిపారు. దుకాణం పైనున్న రేకులు తీసి నిచ్చెన వేసుకుని లోపలకు దిగి చోరీకి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. సీఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి పూర్తిగా విచారిస్తున్నట్లు తెలిపారు.